మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి

మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు
గురువారం | 29 | అక్టోబర్ | 2026 | పేజీలు : 08


2వ పేజీలో

జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్‌లు, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన నగర పోలీస్ కమిషనర్

విశాఖపట్నం , అక్టోబర్ 28 (మనం న్యూస్) : జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి గాజువాక బీహెచ్‌పీవీ , అగనంపూడిలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సౌత్ సబ్ డివిజన్ పరిధిలోని హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి భద్రతా పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా

అర్నబ్ తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు! : మంత్రి అచ్చెన్నాయుడు

- టెక్కలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు టెలీకాన్ఫరెన్స్
- తాగునీరు, వైద్యం, విద్యుత్ పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి సారించాలి.. పంట కాలువలకు గండ్లు పడితే తక్షణమే మరమ్మతులు చేపట్టాలి
- తుఫాన్ తగ్గుముఖం పట్టిన వెంటనే పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయాలి


2వ పేజీలో

కోటబొమ్మాళి , అక్టోబర్ 28 (మనం న్యూస్): అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. టెక్కలి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన ఎంపీడీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ ఎంపీడీవోలతో బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాన్ ప్రభావం, ముందస్తు చర్యలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

తీర ప్రాంత ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం

తుఫాన్ ప్రభావం అధికంగా ఉండే సముద్ర తీర

సమాజంలో అవినీతిని అరికట్టాలి

జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ - విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా ఏసీబీ అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ



విశాఖపట్నం , అక్టోబర్ 28 (మనం న్యూస్) : సమాజంలో అవినీతిని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా జడ్జి జి శ్రీనివాస్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'విజిలెన్స్ వారోత్సవాల'లో భాగంగా, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక అవగాహన పోస్టర్లను జిల్లా జడ్జి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగినా, అవినీతికి పాల్పడినా ప్రజలు భయపడకుండా వెంటనే ఏసీబీ అధికారులను ఆశ్రయించాలని సూచించారు. సమాజంలో అవినీతి రహిత వాతావరణాన్ని తీసుకురావడానికి ప్రజల్లో చైతన్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ ఎస్ ఆర్ హర్షిత మాట్లాడుతూ ఫిర్యాదుల కొరకు సంప్రదించాల్సిన వివరాలను వెల్లడించారు. టోల్ ఫ్రీ నెంబర్: 1064, వాట్సాప్ నెంబర్: 94404 40057, ఈమెయిల్: complaints-acb@ap.gov.in, ఫోన్ నెంబర్: 0866-2428770. ప్రజలు ఈ నెంబర్లను ఉపయోగించుకుని అవినీతిపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి , ఏసీబీ అదనపు ఎస్పీ ఎస్ ఆర్ హర్షిత, మరియు ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

WANTED REPORTERS
మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
రెండు తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకుని ప్రజల గొంతుకై కొనసాగుతున్న మనం తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు విలేకరులు కావలెను. స్థానిక సమస్యలపై అవగాహన కలిగి తెలుగు భాషపై పట్టున్నవారు సంప్రదించగలరు..
కావలసిన జిల్లాలు
విశాఖపట్నం , అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు
పైన పేర్కొన్న జిల్లాలకు వాటి పరిధిలోని మండలాలకు రిక్రూట్మెంట్ జరుగుతుంది.
ఆసక్తి కలవారు సంప్రదించగలరు
విలేకరులు కావలెను (కాంటాక్ట్ ఇమీడియెట్లీ)
ఎం.వి.ఎస్.జి. తిలక్, ఉత్తరాంధ్ర రీజినల్ బ్యూరో చీఫ్
e-mail id : journalist.tilak03@gmail.com
సంప్రదించాల్సిన నెంబరు : 94945 24365

అర్నబ్ తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

ఒకటి తరువాయి ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని మంత్రి సూచించారు. వాతావరణ పరిస్థితులు, అధికారుల సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. ఇందుకోసం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రజలు కూడా అధికారుల సూచనలను పాటిస్తూ సహకరించాలని కోరారు.

పంట కాలువలకు గండ్లు పడితే తక్షణమే మరమ్మతులు

భారీ వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పంట కాలువలకు గండ్లు పడినా, నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడినా వెంటనే స్పందించి మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ భూములకు, పంటలకు నష్టం వాటిల్లకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

తుఫాన్ ప్రభావంతో ఏ గ్రామంలోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అవసరమైన సేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

తుఫాన్ తగ్గగానే పారిశుద్ధ్య పనులు

తుఫాన్ ప్రభావం తగ్గుముఖం పట్టిన వెంటనే గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని మంత్రి సూచించారు. రహదారులు, వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్యం విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు తక్షణ చర్యలు

బలమైన గాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగినా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడినా సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని మంత్రి సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ విద్యుత్ సరఫరాను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని తెలిపారు.తుఫాన్ ప్రభావం పూర్తిగా తొలగిపోయే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సమన్వయంతో పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్‌లు,
హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన నగర పోలీస్ కమిషనర్

ఒకటి తరువాయి చర్యలు చేపట్టాలని, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో డీసీపీ జోన్-II మేరీ ప్రశాంతి, సౌత్ సబ్ డివిజన్ ఏసీపీ వై. శ్రీనివాసరావు, గాజువాక పోలీస్ స్టేషన్ సీఐ సీహెచ్. వాసు నాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ మండలం లో వైసీపీ నుంచి టీడీపీ లో చెరుకులు



గొలుగొండ , అక్టోబర్ 28 (మనం న్యూస్) : గొలుగొండ మండలం జోగంపేట పంచాయతీ జోగంపేట గ్రామానికి చెందిన వైసీపీ మాజీ వార్డ్ సభ్యుడు పంచాడ నాగరాజు ఆధ్వర్యంలో 10 కుటుంబాలు బుధవారం టీడీపీ తిరధం పుచ్చుకున్నారు.నర్సీపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ టౌన్ ఇంచార్జి శ్రీ చిశీతకాయల రాజేష్ వారికి కొశీడువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ అధ్యక్షులు తారక వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు,మాజీ సర్పంచ్ సుర్ల సీతారామూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్ షరీఫ్

గుర్తు తెలియని మృతదేహానికి స్వయంగా అంతిమ సంస్కారాలు



విశాఖపట్నం, (ఆరిలోవ) , అక్టోబర్ 28 (మనం న్యూస్) : విశాఖపట్నం ఆరిలోవ జూ సమీపంలో గోనె సంచిలో లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి అనాథ శవంగా అంతిమ సంస్కారాలు ముగిసే దుస్థితి ఏర్పడిన వేళ, ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ షరీఫ్ మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి ఆదర్శంగా నిలిచారు. రోజుల తరబడి మృతదేహాన్ని క్లెయిమ్ చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో, ఆ వ్యక్తికి దహన సంస్కారాలతో పాటు అన్ని అంతిమ లాంఛనాలను ఆయనే స్వయంగా దగ్గరుండి పూర్తి చేయించారు. ఒక పోలీస్ ఉద్యోగిగా కేవలం విధి నిర్వహణకే పరిమితం కాకుండా, తోటి మనిషి పట్ల ఆయన చూపిన ఈ గొప్ప మానవత్వం స్థానికుల నుంచి విశేష ప్రశంసలందుకుంటున్నారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తా : కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్



ఆనందపురం / భీమిలి , అక్టోబర్ 28 (మనం న్యూస్) : కూటమి అభ్యర్థుల విజయమే తన ధ్యేయమని, వారి గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, వేములవలస పంచాయతీ మాజీ ఉపసర్పంచి కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ స్పష్టం చేశారు. ఆనందపురం మండలం వేములవలస ఎంపీటీసీ స్థానానికి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న బంటుబిల్లి సత్యవేణితోపాటు, జడ్పీటీసీ అభ్యర్థి ఎన్ని శ్రీనివాసరావును అఖండ మెజారిటీతో గెలిపించేందుకు తనవంతు కృషి చేస్తానని ప్రకటించారు. కూటమి అభ్యర్థుల విజయానికి కట్టుబడి ఉన్నానని, తన రాజకీయ వైఖరిపై ఎలాంటి అపోహలకు తావులేదని పేర్కొ న్నారు. తన కుటుంబానికి చెందిన అలేఖ్య వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల బరిలో ఉండటంతో కొందరు తనపై అపోహలు సృష్టిస్తున్నారని, అయితే కుటుంబ సంబంధాలను రాజకీయాలతో ముడిపెట్టి చూడటం సరికాదని అభిప్రాయపడ్డారు. కుటుంబ బంధాలు వ్యక్తిగతమైన వని, రాజకీయ నిర్ణయాలు పార్టీ సిద్ధాంతాలు, తన రాజకీయ నిబద్ధత కు అనుగుణంగా ఉంటాయని స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయడమే తన రాజకీయ లక్ష్యమని నవీన్ జ్ఞానేశ్వర్ పునరుద్ఘాటించారు.

పోలింగ్ కు 48
గంటల ముందు మద్యం దుకాణాలు బంద్

విశాఖపట్నం , అక్టోబర్ 28 (మనం న్యూస్) : నవంబర్ 1 న జరగనున్న జీవీఎంసీ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ అమలులో భాగంగా ఎన్నికల కమిషన్ సూచనల మేరకు మద్యం దుకాణాలను పోలింగ్ కు 48 గంటల ముందు నుండి బంద్ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు జీవీఎంసీ పరిధిలోనున్న దుకాణాలకు వర్తిస్తుందని తెలిపారు. నవంబర్ 1న ఎన్నికల దృష్ట్యా అక్టోబర్ 30న సాయంత్రం 5 గంటల నుండి నవంబర్ 1న సాయంత్రం 5 గంటలవరకు మద్యం విక్రయాల పై నిషేధం విధించినట్లు తెలిపారు. అదే విధంగా నవంబర్ 3 న కౌంటింగ్ దృష్ట్యా ఉదయం 8 గంటల నుండి కౌంటింగ్ పూర్తి అయ్యేవరకు మద్యం విక్రయాలు జరపకూడదని పేర్కొన్నారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ క్షేత్రస్థాయి పరిశీలన

అధికారులకు కీలక ఆదేశాలు, ప్రజలకు హెచ్చరికలు





అనకాపల్లి / బుచ్చయ్యపేట , అక్టోబర్ 28 (మనం న్యూస్) : జిల్లాలో తుఫాను ప్రభావం, భారీ వర్షాల నేపథ్యంలో అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ అనకాపల్లి, బుచ్చయ్యపేట మండలాల్లోని పలు ముంపు, సమస్యాత్మక ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. నీటి ప్రవాహం, వంతెనల పరిస్థితి, ముంపు ముప్పు ఉన్న గ్రామాలను స్వయంగా పరిశీలించి క్షేత్రస్థాయి అధికారులకు తగిన రక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఎస్పీ అనకాపల్లి మండల పరిధిలోని వెంకుపాలెం వద్ద గల శారదా నది ప్రవాహాన్ని పరిశీలించారు. పెద్దేరు రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేసినందున నదిలో నీటి ఉధృతి పెరుగుతోందని, దిగువ ప్రాంత ప్రజలు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం సుందరయ్యపేట నుండి వెంకుపాలెం వెళ్లే మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వెదుళ్ళగడ్డ కాజ్‌వే/బ్రిడ్జి ప్రాంతాన్ని సందర్శించి రాకపోకలను నిలిపివేయాలని ఆదేశించారు. అలాగే బుచ్చయ్యపేట మండలంలోని వడ్డాది బ్రిడ్జి, విజయ రామరాజుపేట ప్రాంతాలను పరిశీలించారు. వడ్డాది వద్ద ఉన్న డౌన్ కాజ్‌వే పూర్తిగా నీట మునిగిపోగా, విజయరామరాజుపేట వద్ద టెంపరరీ కాజ్‌వే వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన పరిస్థితిని సమీక్షించారు. వడ్డాది పైవంతెన పాతది కావడంతో ప్రమాదాలను నివారించేందుకు వైద్య అత్యవసరాలు, నిత్యావసరాలు (రేషన్/మెడిసిన్) వంటి ఎమర్జెన్సీ వాహనాలను మాత్రమే అనుమతించాలని, సాధారణ వాహన రాకపోకలను నియంత్రించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ మాట్లాడుతూ: "జలాశయాల నుంచి దిగువకు నీటిని విడుదల చేసే ముందే లోతట్టు ప్రాంత గ్రామాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు (ఔఠీఅఱఅస్త్ర) జారీ చేయాలి."

"దిగువ ప్రాంత పోలీస్ స్టేషన్ల ఎస్హెచ్ఓలను వ్యక్తిగతంగా అప్రమత్తం చేసి, నిరంతరం అప్రమత్తంగా ఉంచాలి ."""వరద ఉధృతి తగ్గేవరకు ప్రజలు, రైతులు వాగులు, వంకలు, నదులు దాటకూడదు. చేపల వేట వంటి ప్రమాదకర పనులకు ఎవరూ వెళ్లరాదు". "వంతెనలు, కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తున్నప్పుడు ద్విచక్ర వాహనాలు గానీ, ఇతర వాహనాలతో గానీ రోడ్లు దాటే ప్రయత్నం చేయవద్దు". "ప్రజల అత్యవసర సహాయం, రక్షణ చర్యల నిమిత్తం బుచ్చయ్యపేట తదితర ప్రాంతాలకు అదనపు పోలీసు బలగాలతో పాటు ఎస్డీఆర్ఎఫ్ (SDRF), ఎన్డీఆర్ఎఫ్ (NDRF) బృందాల సేవలను సిద్ధంగా ఉంచడం జరిగింది". ఈ తనిఖీలలో జిల్లా ఎస్పీతో పాటు అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ పి.వి.వి.నరసింహారావు, ఎస్.బి సిఐ బాల సూర్యారావు, అనకాపల్లి రూరల్ సిఐ అశోక్ కుమార్, బుచ్చయ్యపేట సిఐ కోటేశ్వరరావు, ఎస్సైలు మనోజ్ కుమార్, రవికుమార్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





నేడు (29న) అన్ని విద్యా సంస్థలకు సెలవు : జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం , అక్టోబర్ 28 (మనం న్యూస్) : అర్నాబ్ తుపాను ప్రభావం కారణంగా జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు గురువారం కూడా సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. విద్యార్థుల రక్షణ, భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, జూనియర్, డిగ్రీ కళాశాలలకు ఈ సెలవులు వర్తిస్తాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

బుధవారం రాత్రి 9.00 నుంచి గురువారం ఉదయం 8.00 గంటల వరకు ట్రాఫిక్ నిలుపుదల తుపాను ప్రభావం ఇంకా కొనసాగుతున్నందున బుధవారం రాత్రి 9.00 గంటల నుంచి గురువారం ఉదయం 8.00 గంటల వరకు విశాఖపట్నం జిల్లా, నగరం పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ నిలుపుదల చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ప్రకటించారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సెల్యూట్ పోలీస్..థాంక్యూ సీపీ..అంటున్న విశాఖ నగర ప్రజలు!



విశాఖ , అక్టోబర్ 28 (మనం న్యూస్) : తుఫాన్ కారణంగా నగరంలో పడిపోయిన భారీ వృక్షాలను తొలగించడంలో విశాఖ సిటీ పోలీసులు చూపిన తెగువకు నగర ప్రజలు సెల్యూట్ చేస్తున్నారు. విశాఖ నగర పోలీస్ కమీషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., ఆదేశాల మేరకు సిటీలో ఉన్న పోలీస్ సిబ్బంది మొత్తాన్ని రంగంలోకి దింపారు. సిటీ డిజాస్టర్ రెస్పాండ్ టీం (ణ=ళీ) తో కలిసి ఎక్కడెక్కడ పడిపోయిన భారీ వృక్షాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చేశారు. ఓ పక్క పడిపోయిన వృక్షాలను తొలగిస్తూనే, మరో పక్క ఎలక్ట్రికల్ శాఖ వారికి కూడా సహాయంగా నిలవడంతో విద్యుత్ శాఖ సిబ్బంది నత్వరమే కరెంటును పునరుద్ధరించగలిగారు. ఉదయం 5 గంటల నుండి కంచరపాలెం, కప్పరాడ, బాబుజీ నగర్ ప్రాంతాల్లో నిలిచిపోయిన కరెంటు పోలీసుల చొరవతోనే తిరిగి వచ్చిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తుఫాను వేళ అదుకున్న పోలీసులకు నగర ప్రజల నుండి జై హింద్ సెల్యూట్!

తుఫాను సమయంలో రైతులకు సూచనలు

భీమునిపట్నం , అక్టోబర్ 28 (మనం న్యూస్) : తుఫాను సమయంలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను ఉద్యాన శాఖ అధికారిని భాను పుష్ప లీలావతి తెలియచేసారు. తుఫాను సమయంలో బలమైన గాలులు, వర్షాల వల్ల పంటలు ఒరిగిపోవడం, కొమ్మలు విరిగిపోవడం మరియు వేర్లు దెబ్బతినడం వంటి నష్టాలు జరుగుతాయి. పంట రక్షణ కోసం రైతులు ?తోటల్లో నీటి పారుదల నాళాల ఏర్పాటు చేయడం, వర్షపు నీరు తోటల్లో నిలిచిపోకుండా వెంటనే బయటకు వెళ్లేలా డ్రైనేజీ (నీటి యాజమాన్యం) కాల్వలను శుభ్రం చేసుకోవాలన్నారు. లేకపోతే వేరుకుళ్లు, మొదలుకుళ్లు తెగుళు ఆశించే ప్రమాదం ఉంటుందని, పందిరి పంటలు, టమాటా, మిరప వంటి తోటలకు కట్టెలతో ఆధారాలు ఏర్పాటు చేసి మొక్కలు పడిపోకుండా కట్టాలన్నారు. తుఫాను ముగిసే వరకు ఎలాంటి ఎరువులు, పురుగుమందులు చల్లకూడదని, బహువార్షిక పంటల్లో (మామిడి, కొబ్బరి, జామ, సపోటా మొదలైనవి) ప్రత్యేక జాగ్రత్తలు: గాలుల ధాటికి చెట్ల కొమ్మలు విరిగిపోకుండా బారమైన, ఎండు మరియు బలహీనమైన కొమ్మలను ముందుగానే తొలగించాలన్నారు. చిన్న లేదా లేత చెట్లకు కర్రలు/వెదురు బొంగులతో ఆధారాలు ఇచ్చి గట్టిగా కట్టాలని, కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో పండిన మట్టలు, ముదిరిన గెలలను తొలగించాలి. అరటి తోటల్లో గాలి ఉధృతికి చెట్లు విరగకుండా ప్రతి చెట్టుకు వెదురు బొంగులతో మద్దతు ఇవ్వడం చాలా ముఖ్యం అని అన్నారు. తుఫాను తగ్గిన వెంటనే చెట్ల మొదళ్ల వద్ద నీరు నిలవకుండా చూసుకోవాలి. గాలులకు విరిగిన కొమ్మలను తీసివేసి, గాయపడిన భాగాలపై 'బోర్డో పేస్ట్' లేదా కార్బండజిమ్ మందును వూయాలి. తోటలు కోలుకోవడానికి మరియు కొత్త వేర్లు రావడానికి తోట సాధారణ స్థితికి వచ్చాక సిఫారసు చేసిన పోషకాలను, లీటరు నీటికి 5 గ్రాముల 19-19-19 పిచికారీ చేయాలన్నారు.

సోరియాసిస్ అంటువ్యాధి కాదు..అపోహలను వీడండి

అక్టోబర్ 29 సోరియాసిస్ వ్యాధి నివారణా దినం

భీమునిపట్నం , అక్టోబర్ 28 (మనం న్యూస్) : ప్రపంచ సోరియాసిస్ వ్యాధి నివారణా దినోత్సవం అక్టోబర్ 29 సందర్భంగా సోరియాసిస్ అవగాహన వారోత్సవాలను గీతం హాస్పిటల్ డెర్మటాలజీ ఓపి లో నిర్వహిస్తున్నట్లు మరియు ఉచిత రక్త పరీక్షలు, చర్మ పరీక్షలు నిర్వహిస్తున్నామని విభాగాధిపతి డాక్టర్.రాహుల్ రే తెలిపారు. చర్మంపై ఎర్రటి మచ్చలు, వాటిపై తెల్లటి పొలుసులు, దురద కనిపించగానే చాలామంది భయపడుతుంటారు. ముఖ్యంగా ఇవి సోరియాసిస్ లక్షణాలైతే, ఇతరులకు వ్యాపిస్తుందనే అపోహతో బాధితులకు దూరంగా ఉండటం, సామాజిక కార్యక్రమాలకు దూరం చేయడం వంటి పరిస్థితులు ఎదురవుతున్నాయి. అయితే, సోరియాసిస్ ఒక దీర్ఘకాలిక చర్మవ్యాధి మాత్రమే; ఇది అంటువ్యాధి కాదు. బాధితులను తాకడం, వారితో కలిసి భోజనం చేయడం, చేతులు కలపడం లేదా పక్కన కూర్చోవడం వల్ల ఈ వ్యాధి ఇతరులకు వ్యాపించదు.

సోరియాసిస్ అంటే ఏమిటి?

సోరియాసిస్ అనేది రోగనిరోధక వ్యవస్థలో ఏర్పడే మార్పుల కారణంగా చర్మ కణాలు సాధారణం కంటే వేగంగా వృద్ధి చెందే దీర్ఘకాలిక వ్యాధి. దీనివల్ల చర్మంపై ఎర్రటి, మందమైన మచ్చలు ఏర్పడి, వాటిపై తెల్లటి పొలుసులు ఏర్పడతాయి. మోచేతులు, మోకాళ్లు, తలలో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. కొందరిలో గోళ్లలో గుంటలు పడటం, గోళ్లు మందంగా మారడం వంటి లక్షణాలు కూడా ఉంటాయి. ఈ వ్యాధి కొంతకాలం తగ్గినట్లు కనిపించి, మళ్లీ తిరగబెట్టవచ్చు. అందువల్ల దీన్ని సరైన వైద్య పర్యవేక్షణలో నియంత్రించుకోవడం అవసరం.

సోరియాసిస్ ఎందుకు వస్తుంది?

సోరియాసిస్ రావడానికి జన్యుపరమైన అంశాలు, రోగనిరోధక వ్యవస్థలో మార్పులు ముఖ్యమైన కారణాలు. మానసిక ఒత్తిడి, కొన్ని ఇన్ఫెక్షన్లు, చర్మానికి గాయాలు, కొన్ని మందులు వంటి అంశాలు కొందరిలో వ్యాధిని ప్రేరేపించవచ్చు లేదా తీవ్రతను పెంచవచ్చు. అయితే, ప్రతి ఒక్కరిలో కారణాలు ఒకేలా ఉండవు.ఇది అపరిశుభ్రత వల్ల వచ్చే వ్యాధి కాదు. ఆహారపు అలవాట్లు లేదా వ్యక్తిగత పరిశుభ్రతను మాత్రమే కారణంగా భావించడం సరికాదు. సోరియాసిస్ ఇతర అవయవాలపై కూడా ప్రభావం చూపుతుందా? సోరియాసిస్ కేవలం చర్మానికే పరిమితమైన వ్యాధి కాదు. కొందరిలో కీళ్ల నొప్పులు, వాపు, ఉదయం వేళ కీళ్లు బిగుసుకుపోవడం వంటి లక్షణాలతో సోరియాటిక్ ఆర్థరైటిస్ అనే సమస్య రావచ్చు. అలాగే కొందరిలో అధిక బరువు, మధుమేహం, అధిక రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పెరిగి ఉండవచ్చు. అందువల్ల చర్మ లక్షణాలతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలను కూడా అవసరాన్ని బట్టి వైద్యులు పరిశీలిస్తారు.

సోరియాసిస్‌కు చికిత్స ఉందా?

సోరియాసిస్‌ను పూర్తిగా శాశ్వతంగా నిర్మూలించే చికిత్స ప్రస్తుతం అందుబాటులో లేకపోయినా, ఆధునిక వైద్యంతో వ్యాధిని సమర్థవంతంగా నియంత్రించవచ్చు. వ్యాధి తీవ్రత, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి చర్మానికి రాసే మందులు, ఫోటోథెరపీ, నోటి ద్వారా తీసుకునే మందులు లేదా ఆధునిక బయోలాజిక్ చికిత్సలను చర్మవ్యాధి నిపుణులు సూచిస్తారు. వైద్యుల సలహాతో చికిత్సను క్రమం తప్పకుండా కొనసాగించడం, చర్మాన్ని తేమగా ఉంచడం, ఆరోగ్యకరమైన జీవన శైలి మరియు అధిక బరువు నియంత్రించుకోవడం ,ధూమపానం మరియు అధిక మద్యపానానికి దూరంగా ఉండడం, ఒత్తిడిని తగ్గించుకోవడం ప్రయోజనకరం. స్వయంగా మందులు వాడటం, ముఖ్యంగా స్టెరాయిడ్ క్రీములను వైద్యుల సలహా లేకుండా ఉపయోగించడం హానికరం కావచ్చు.

సమాజం చేయాల్సిందేమిటి?

సోరియాసిస్ ఉన్నవారిని దూరంగా ఉంచడం, వివాహం లేదా ఉద్యోగం విషయంలో వివక్ష చూపడం, వారిని మానసికంగా కుంగదీయడం తగదు. ఈ వ్యాధి బాధితుల్లో ఆత్మవిశ్వాసం తగ్గడం, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు ఏర్పడవచ్చు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహోద్యోగులు వారికి అండగా నిలవాలి. చర్మంపై ఇలాంటి లక్షణాలు కనిపిస్తే సిగ్గుపడకుండా, భయపడకుండా చర్మవ్యాధి నిపుణులను సంప్రదించాలి.

సరైన సమయంలో రోగనిర్ధారణ, తగిన చికిత్స, అవగాహనతో మెరుగైన జీవన నాణ్యత సాధ్యమవుతుంది. సోరియాసిస్ అంటువ్యాధి కాదు. బాధితులకు దూరంగా కాదు – అండగా నిలుద్దాం. అపోహలను తొలగిద్దాం, అవగాహన పెంచుదాం.

టిడిపిలోకి సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మాజీ సభ్యుడు వారణాశి దినేష్ రాజ్

- ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు
- మేయర్, కూటమి కార్పొరేటర్లకి ఘన విజయం చేకూర్చాలని వినతి



గాజువాక , అక్టోబర్ 28 (మనం న్యూస్) : సీనియర్ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు వారణాశి దినేష్ రాజ్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు దినేష్ రాజ్ ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దినేష్ రాజ్ మీడియాతో మాట్లాడారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా నవంబర్ 1 జరుగు పోలింగ్ నేపథ్యంలో ఓటర్లుగా నమోదు చేసుకున్న ప్రతీ ఒక్కరూ తమ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. నిరంతరం అభివృద్ధి చెందుతున్న విశాఖనగరం శాంతి భద్రతలతో పాటు పారిశ్రామిక అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలుగుదేశం జనసేన బిజేపి మేయర్ ఉమ్మడి అభ్యర్థిని ముక్కా శ్రావణి కి సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీ ఇచ్చి ప్రజలు అభివృద్ధి వైపే ఉన్నారని నిరూపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కూటమి కార్పొరేటర్ అభ్యర్థులుగా పోటీ చేయుచున్న వారందరికీ అత్యధిక మెజారిటీ ఇవ్వవలసిశీదిగా కోరారు. విశాఖ నగరం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నా పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని బలపరచి, జీవీఎంసి ఎన్నికలలో నూరు శాతం స్ట్రైక్ రేట్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు సమక్షంలో నాయకత్వంలో పార్టీ మరింత బలవడేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తానని దినేష్ రాజ్ పేర్కొన్నారు.

అర్నబ్ తుఫాన్ ఎఫెక్ట్: రైవాడ రిజర్వాయర్ కు పోటెత్తిన వరద నీరు



దేవరాపల్లి , అక్టోబర్ 28 (మనం న్యూస్) : బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దేవరాపల్లి మండలంలోని రైవాడ రిజర్వాయర్ కు భారీగా ఇన్ ఫ్లో వస్తోంది.రిజర్వాయర్ నీటి వివరాలను డీఈఈ జి. సత్యం నాయుడు బుధవారం (28/10/2026) సాయంత్రం 6 గంటలకు విడుదల చేశారు.నీటి వివరాలు (సాయంత్రం 6 గంటలకు)ఎఫ్ఆర్ఎల్ – 114.00 ఎం, సామర్థ్యం: 3600 ఎంసీఎఫ్‌టీ పిఎండబ్ల్యూ– 107.60 ఎం ,లి ప్రస్తుత నిల్వ: 1.60 టీఎంసీ వర్షపాతం 20 ఎంఎం ఇన్ ఫ్లోస్ 2800 క్యూసెక్కులు,అవుట్ ఫ్లోస్ 50 క్యూసెక్కులు తుఫాను కారణంగా మరింత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, రైతులు, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

జోరు వానలో సైతం భారీ జనవాహినితో దూసుకుపోతున్న టీడీపీ ప్రచారం



దేవరాపల్లి , అక్టోబర్ 28 (మనం న్యూస్) : దేవరాపల్లి మండల కేంద్రం సెగ్మెంట్–1–2 అభ్యర్థులు జోరు వానను సైతం లెక్కచేయకుండా భారీ జనవాహినితో గొడుగులతో టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి కిలపర్తి రాజేశ్వరి భాస్కర్ రావు డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు.వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మండల కేంద్రంలోని ప్రతి వీధిలో భారీ జనవాహినితో సాగిన ఈ ప్రచారానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ప్రతి ఇంటికి తిరుగుతూ ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ, రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు.ఆమె వెంట సెగ్మెంట్ –1 ఎంపీటీసీ అభ్యర్థి దివి రాజు సెగ్మెంట్–2 ఎంపీటీసీ అభ్యర్థి పొట్టేల సన్యాసిరావు (చంటి) మరియు మహాకూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో గొడుగులు పట్టుకుని ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆర్న బ్ తుఫాన్ నష్టంపై సమగ్ర సర్వే.. ప్రతి రైతుకూ న్యాయం జరగాలి!

- పంట నష్టంపై నిర్లక్ష్యం వద్దు..
క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే చేపట్టండి
- గ్రామాలవారీగా, పంటలవారీగా నష్టం అంచనాలు సిద్ధం చేయాలి
- క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో నేరుగా మాట్లాడాలి
- వాస్తవ నష్టాల వివరాలతో సమగ్ర నివేదికలు అందించాలి
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశం



కోటబొమ్మాళి , అక్టోబర్ 28 (మనం న్యూస్) : అర్నబ్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన పంటలకు జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, వాస్తవ వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కు, అధికారులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫోన్‌లో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి, తుఫాన్ ప్రభావం, పంటల పరిస్థితి, రైతులకు అందించాల్సిన సహాయక చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లాలో పంట నష్టాన్ని సాధ్యమైనంత మేరకు తగ్గించడంతో పాటు, నష్టపోయిన రైతులకు అండగా నిలిచేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బంది నుంచి మండల, జిల్లా స్థాయి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. గ్రామాల్లో రైతులను నేరుగా కలిసి మాట్లాడి, తుఫాన్ కారణంగా ఏయే పంటలకు ఎంతమేర నష్టం వాటిల్లిందో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వరి సహా ఇతర వ్యవసాయ పంటలు, ఉద్యానవన పంటల పరిస్థితిని సమగ్రంగా అంచనా వేయాలని స్పష్టం చేశారు. పంటలవారీగా, గ్రామాలవారీగా, రైతులవారీగా నష్టం వివరాలను సేకరించి, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రాథమిక నష్టం అంచనాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందించడంతో పాటు, సమగ్ర నివేదికలను నిర్ణీత సమయంలో సమర్పించాలని ఆదేశించారు. పంట నష్టానికి సంబంధించిన వివరాల సేకరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.

పంటల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి

తుఫాన్ ప్రభావంతో పొలాల్లో నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి, పంటలకు మరింత నష్టం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కు సూచించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించిన వెంటనే క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి, పంటల సంరక్షణకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు, కోత కోసిన అనంతరం పొలాల్లో లేదా కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా రైతులకు తగిన జాగ్రత్తలు వివరించాలని పేర్కొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పంట నష్టం అంచనాలు, పంటల సంరక్షణ చర్యలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

ప్రతి రైతుకు అండగా నిలవాలి

తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించాలని, అర్హులైన రైతులకు ప్రభుత్వ నిబంధనల మేరకు సహాయం అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ కు సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పంట నష్టం అంచనాల ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రైతులకు అవసరమైన సహాయక చర్యలను సమన్వయంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కు ఆదేశించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.

ఫిషింగ్ హార్బర్ లో పర్యటించిన ఎంపీ భరత్ ,ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



- మత్స్యకారులకు అండగా ఉంటాం.. నష్టంపై అధికారులతో చర్చించి ప్రభుత్వ సహకారం అందేలా చూస్తాం
- జోరువానలో మత్స్యకారులతో స్వయంగా మాట్లాడిన ఎంపీ ఎమ్మెల్యే

విశాఖపట్నం , అక్టోబర్ 28 (మనం న్యూస్) : తుఫాన్ కారణంగా ఫిషింగ్ హార్బర్‌లో తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో ఎంపీ శ్రీ భరత్ , దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఫిషింగ్ హార్బర్‌లో పర్యటించి, నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తీర ప్రాంతంలో మత్స్యకారులతో స్వయంగా మాట్లాడి, తుఫాన్ కారణంగా జరిగిన నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావంతో ఐదు బోట్లు సముద్రంలో మునిగిపోగా, మరో బోటు పూర్తిగా దెబ్బతిన్నట్లు మత్స్యకారులు ఎంపీ, ఎమ్మెల్యేలకు వివరించారు.

మత్స్యకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలు జరిగిన నష్టంపై సంబంధిత మత్స్యశాఖ అధికారులతో మాట్లాడారు. నష్టపోయిన మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా.. కష్టకాలంలో తమకు అండగా నిలిచేందుకు ఫిషింగ్ హార్బర్‌కు వచ్చి, తమ సమస్యలను స్వయంగా తెలుసుకున్న ఎంపీ శ్రీ భరత్ , ఎమ్మెల్యే శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్‌కి మత్స్యకారులు కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో తమ సమస్యలను పట్టించుకుని, ధైర్యం చెప్పేందుకు వచ్చిన ప్రజాప్రతినిధులకు మత్స్యకారులు ధన్యవాదాలు తెలియజేశారు.

అర్నబ్ తుపాను బీభత్సం మండలంలో భారీ నష్టం, నిలిచిన జనజీవనం



అల్లూరి సీతారామరాజు జిల్లా, అనంతగిరి , అక్టోబర్ 28 (మనం న్యూస్) : బంగాళాఖాతంలో ఏర్పడిన అతి తీవ్ర 'అర్నబ్' తుపాను ఏపీ తీరాన్ని తాకిన నేపథ్యంలో, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మన్య ప్రాంతమైన అనంతగిరి మండలంలో తీవ్ర విధ్వంసం చోటుచేసుకుంది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాల కారణంగా ఘాట్ రోడ్లు, పంటలు, ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.

వరద ఉధృతికి కొట్టుకుపోయిన బ్రిడ్జీలు – రోడ్లు నిలిచిన రాకపోకలు:

మండలంలోని గోన్తని నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాగులు, గెడ్డలు పొంగిపొర్లుతున్నాయి. కొత్తూరు పంచాయతీ పరిధిలోని శివలింగాపురం – కృష్ణాపురం మధ్య ఉన్న కీలకమైన బ్రిడ్జి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. తాడిగూడ గ్రామంలో రోడ్లు, కల్వర్టులు కొట్టుకుపోవడంతో వందలాది గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కిరండూల్ – కొత్తవలస కె కె లైన్ రైలు మార్గంలోని బొర్రా – కరకవలస రైల్వే స్టేషన్ల మధ్య వరద ప్రవాహానికి పట్టాల కింద ఉన్న మట్టి కొట్టుకుపోయి రైలు మార్గానికి తీవ్ర నష్టం వాటిల్లింది.

నేలకొరిగిన ఇళ్లు, నష్టపోయిన పంట పొలాలు:

తీవ్రమైన గాలుల ధాటికి అనంతగిరి పరిసర గ్రామాల్లోని పలు నివాస గృహాలు, తాత్కాలిక షెడ్లు దెబ్బతిన్నాయి. గిరిజనులు సాగుచేసే వరి, ఉద్యానవన పంట పొలాలు నీట మునిగి కుప్పకూలాయి. కొండలపై ఉన్న కాఫీ తోటలకు కూడా భారీ నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమాచారం.

ప్రాణ, పశు నష్టం వివరాలు:

నిన్ని మామిడి గ్రామ తామల దేముడు (35)గుండె పోటుతో మంగళవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు అధికారుల ముందస్తుగా హెచ్చరికలు జారీ చేయడం, అధికారులు అప్రమత్తమై ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో ఇక్కడ భారీ ప్రాణనష్టం తప్పింది. అయితే, లోతట్టు ప్రాంతాల్లోని పెరళ్లలో కట్టేసిన పశువులు, జీవాలు వరద నీటిలో చిక్కుకుని కొన్ని మృత్యువాత పడ్డాయి.

అప్రమత్తమైన యంత్రాంగం:

రోడ్లపై విరిగిపడిన భారీ వృక్షాలను, విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు పోలీసు రెవిన్యూ అధికారులు విపత్తు నిర్వహణ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపడుతున్నారు.



గుండెకోత మిగిల్చిన తుఫాన్ బీభత్సం

చేతికందే వేళ నేలపాలైన పైరు

కవిటి , అక్టోబర్ 28 (మనం న్యూస్) :'రేపోమాపో కోత కొయ్యాలి.. ధాన్యం ఇంటికి చేరితే పిల్లల చదువుల ఫీజులు కట్టొచ్చు.. చేసిన అప్పుల్లో కొంతైనా తీర్చొచ్చు అనుకున్నాం సామీ.. అంతలోనే ఈ తుఫాన్ మా బతుకులను నడిరోడ్డున పడేసింది..” అంటూ ఓ రైతు కన్నీటిపర్యంతమైన తీరు అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయాలను కలచివేసింది. రక్తాన్ని చెమటగా మార్చి, రాత్రింబవళ్ళు కష్టపడి కంటికి రెప్పలా కాపాడుకున్న పంట చేతికందే సమయంలో 'ఆర్నాబ్' తుఫాన్ రూపంలో అన్నదాతల ఆశలపై పిడుగు పడింది. రెండు రోజులుగా కవిటి మండలంలో కురిసిన కుండపోత వర్షం, అంతకుమించిన ఈదురుగాలులు పచ్చని పంట పొలాలు పొట్టకొచ్చిన, కోత దశకు చేరిన వరి పైరు నేలకొరిగి బురద నీటిలో నానుతుంటే.. ఆ దృశ్యాన్ని చూసి రైతన్నలు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

కొబ్బరి చెట్లు నేలమట్టం.. తీరని వేదన

కవిటి ప్రాంతంలో కొబ్బరి అంటే కేవలం చెట్లు మాత్రమే కాదు.. తరతరాలుగా అన్నదాతలను సాకుతున్న జీవనాధారాలు. మొక్క దశ నుంచే చీడ పీడలను ఎదురొడ్డి పెంచి పెద్ద చేసుకున్న ఆ చెట్లు పెనుగాలుల ధాటికి వేర్లతో సహా నేలకూలాయి. మండలంలోని కవిటి, జగతి, జల్లుపుట్టుగ, ప్రగడపుట్టుగ, వరక, బెజ్జిపుట్టుగ, బల్లిపుట్టుగ, మణిక్యపురం, గోవిందపుట్టుగ, డి.గొనపపుట్టుగ గ్రామాల్లో సుమారు 119 మంది రైతులకు చెందిన 186 కొబ్బరి చెట్లు నేలమట్టమయ్యాయి. కొబ్బరిలో అంతర పంటగా సాగు చేసుకున్న అరటి, కోకో, మునగ లాంటి అంతర పంటలు కూడా సర్వనాశనమయ్యాయి. పాతికేళ్లుగా



ఆదాయాన్నిచ్చిన చెట్టు కూలిపోవడంతో రైతు కుటుంబాల భవిష్యత్తు అంధకారంలో పడింది.

అప్పుల ఊబిలో కుటుంబాలు

ఎకరాకు వేల రూపాయల పెట్టుబడి పెట్టి, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి సాగు చేస్తే.. ఇప్పుడు పెట్టుబడి మాట దేవుడెరుగు, కనీసం తిండి గింజలు కూడా మిగిలే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

తడిసిన ధాన్యం మొలకలొస్తే పశువుల గ్రాసానికి కూడా పనికిరాదని ఆవేదన చెందుతున్నారు. మరోవైపు పెనుగాలులకు పలుచోట్ల భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో గ్రామాల్లో రాకపోకలు స్తంభించాయి. తహసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో సోంపేట అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి రోడ్లపై పడిన చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించారు. ప్రకృతి కన్నెర్రకు నిలువునా మునిగిపోయిన తమను ఆదుకోవడానికి ప్రభుత్వమే ముందుకు రావాలని, తక్షణ పరిహారం అందించే దిశగా కృషి చేయాలని వేడుకుంటున్నారు.



పంట నష్టాన్ని అంచనా వేస్తున్న ఉద్యానవన శాఖ అధికారి మాధవి లత



నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్న అధికారులు

ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తేదీలు మార్పు - ఎస్ఈసీ కీలక ప్రకటన



దేవరాపల్లి , అక్టోబర్ 28 (మనం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ లో జరగనున్న రెండో విడత సాధారణ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తేదీలను రాష్ట్ర ఎన్నికల సంఘం రీషెడ్యూల్ చేసింది.ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ నెం. 905/ సెప్టెంబర్-బి 1/2026, తేదీ: 28.10.2026 న విడుదల చేసింది.గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఎంపీటీసీ, జడ్పీటీసీలకు 03.11.2026 న పోలింగ్, 05.11.2026 న కౌంటింగ్ జరగాల్సి ఉంది. అయితే అదే రోజు (03.11.2026) పట్టణ స్థానిక సంస్థల (ఖతీఫుఅ నాశీఫుశ్రీ దీశీనఅవం) ఓట్ల లెక్కింపు కూడా ఉండటంతో, పోలీసు, పోలింగ్ సిబ్బంది కొరత ఏర్పడుతుందని ఎస్ఈసీ పేర్కొంది. అందుకే ఎన్నికలను వాయిదా వేసినట్లు తెలిపింది.సవరించిన కొత్త షెడ్యూల్: కొత్త తేదీ పోలింగ్ నిర్వహణ 05.11.2026 (ఉదయం 7 గం. నుండి సాయంత్రం 5 గం. వరకు) రీ-పోల్ (ఏదైనా ఉంటే)06.11.2026 (ఉదయం 7 గం. నుండి సాయంత్రం 5 గం. వరకు) ఓట్ల లెక్కింపు 07.11.2026 (ఉదయం 8 గం. నుండి) ఫలితాల ప్రకటన లెక్కింపు పూర్తయిన వెంటనే గతంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 44 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ముగింపు సమయాన్ని సాయంత్రం 5 గంటల నుండి 3 గంటలకు కుదించిన విషయం తెలిసిందే.

ఆర్నాబ్ తుఫాన్ ఎఫెక్ట్ : రంగంలోకి దిగిన దేవరాపల్లి ఎస్సై సత్యనారాయణ - ప్రజలకు కీలక సూచనలు



దేవరాపల్లి , అక్టోబర్ 28 (మనం న్యూస్) : ఆర్నాబ్ తుఫాను ప్రభావంతో దేవరాపల్లి మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు తామరబ్బ, సమ్మెద మార్గంలో గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెనపై నుంచి వరద నీరు ఉధృతంగా పారుతుండటంతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.పరిస్థితిని గమనించిన దేవరాపల్లి ఎస్ఐ వి. సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి బుధవారం గెడ్డ వద్దకు చేరుకుని పరిశీలించారు. వరద ప్రాంతాన్ని పరిశీలించి, ప్రజలు ప్రమాదానికి గురికాకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ – వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో ఎవరూ సాహసం చేయవద్దని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. వరద ఉధృతి తగ్గే వరకు ఆ మార్గంలో ప్రయాణం చేయవద్దని, పోలీసులకు సహకరించాలని ప్రజలకు, వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అనకాపల్లిలో వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశాలు ఘనంగా నిర్వహణ

107 నుంచి 112 వార్డుల అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలి: వరుదు కళ్యాణి



అనకాపల్లి , అక్టోబర్ 28 (మనం న్యూస్) : జీవీఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అనకాపల్లి నియోజకవర్గంలో 107, 108, 109, 110, 111, 112 వార్డులకు సంబంధించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైఎస్సార్‌సీపీ) ఆత్మీయ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఈ సమావేశాలు జరిగాయి .అనకాపల్లిలోని వివేకానంద ఫంక్షన్ హాల్‌లో 110, 111, 112 వార్డులకు సంబంధించిన సమావేశం నిర్వహించగా, జిల్లా పార్టీ కార్యాలయంలో 107, 108, 109 వార్డులకు సంబంధించిన సమావేశం జరిగింది. ఈ సమావేశాలకు జీవీఎంసీ వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థి, శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాబోయే జీవీఎంసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు పూర్తి మద్దతు అందించి, వారి విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ప్రతి వార్డులో ప్రజలతో మమేకమై పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు: 107వ వార్డు: పన్నీరు వెంకటలక్ష్మి, 108వ వార్డు: బొడ్డేడ సరోజిని, 109వ వార్డు: కర్రి లలిత, 110వ వార్డు: ఉగ్గిన జోష్ణ పద్మజ, 111వ వార్డు: నదియా, 112వ వార్డు: జాజుల ప్రసన్నలక్ష్మి ఆరు వార్డుల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా పనిచేయాలని, ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ప్రజల మద్దతు లభించేలా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, మాజీ ఎంపీ డాక్టర్ వి. సత్యవతి, పార్టీ నాయకులు జానకిరామ్, శోభ హైమావతి, సతీష్ వర్మ, రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పార్టీ బూత్ ఏజెంట్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాలను విజయవంతం చేశారు.



అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న వరుదు కళ్యాణి





అనకాపల్లి , అక్టోబర్ 28 (మనం న్యూస్) : అనకాపల్లిలో ప్రసిద్ధి చెందిన శ్రీ నూకాంబిక అమ్మవారిని శాసన మండలి సభ్యురాలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి దర్శించుకొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

అర్నబ్ తుఫాన్ బాధితులకు అండగా బొత్స అనూష పర్యటన



భీమునిపట్నం , అక్టోబర్ 28 (మనం న్యూస్) : స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార సమయం అయినప్పటికీ, ప్రజా సమస్యలకే ప్రాధాన్యతనిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భీమిలి సమన్వయకర్త డాక్టర్ బొత్స అనూష పర్యటన బుధవారం భీమిలి జోన్-1లో కొనసాగింది. అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో భీమిలి తీర ప్రాంతాల్లో సముద్రపు అలలు ఉధృతంగా ఎగసిపడటంతో మత్స్యకారులు, స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. మూడవ వార్డులోని లోతట్టు ప్రాంతమైన తోటవీధిలోకి సముద్రపు నీరు చేరడంతో ప్రజలు ప్రాణభయంతో పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నాలుగవ వార్డులోని బోయివీధిలో రిటైనింగ్ వాల్ నిర్మాణం లేకపోవడంతో సముద్రపు నీరు ఇళ్లలోకి చేరి మత్స్యకార కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఐదవ వార్డులోని మంగమారిపేటలో అలల తాకిడికి ఇల్లు కూలిపోయిన ఘటన స్థానికుల ఆందోళనను మరింత పెంచింది. ఈ పరిస్థితులను స్వయంగా పరిశీలించిన డాక్టర్ బొత్స అనూష తీర ప్రాంత ప్రజలు, మత్స్యకార కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలను చూసి చలించిపోయారు. బాధితులకు తక్షణ సహాయం అందించాలని, ఆహారం, పాలు, నిత్యావసర సరుకులు, అవసరమైన వసతులు కల్పించాలని పార్టీ శ్రేణులకు ఆదేశించారు. ప్రమాదంలో ఉన్న ప్రజలకు అండగా నిలిచి, సహాయక కార్యక్రమాలను ముమ్మరం చేయాలని సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భీమిలి జోన్-1 పరిశీలకుడు, మత్స్యకార నాయకుడు వాసుపల్లి జానకిరామ్, పర్యవేక్షణలో మూడవ వార్డులో కార్పొరేటర్ అభ్యర్థి అక్కరమాని రోహిణి, నాలుగవ వార్డులో కార్పొరేటర్ అభ్యర్థి అల్లిపల్లి పార్వతి వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు, బోయివీధి ప్రాంత నాయకులు, ఐదవ వార్డులో కార్పొరేటర్ అభ్యర్థి దౌలపల్లి లక్ష్మి, మాజీ కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు తదితరులు బాధిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అండగా నిలిచారు.

టీడీపీలోకి వైసీపీ, సీపీఐ నాయకుల చేరికలు..చింతకాయల రాజేష్ సమక్షంలో టీడీపీలో చేరిన 10 కుటుంబాలు







నర్సీపట్నం,అక్టోబర్ 28 (మనం న్యూస్) : నర్సీపట్నం నియోజకవర్గం లో వైసీపీ, సీపీఐ పార్టీలకు చెందిన నాయకులు టీడీపీలో చేరారు. నర్సీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి చింతకాయల రాజేష్ సమక్షంలో వైసీపీకి చెందిన సుమారు 10 కుటుంబాలు టీడీపీలో చేరాయి. జోగంపేట మాజీ సర్పంచ్ సుర్ల సీతారామమూర్తి, పార్టీ అధ్యక్షుడు చిటికెల తారక వేణుగోపాల్, అడిగర్ల అప్పలనాయుడు పార్టీ అధ్యక్షులు చిటికెల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.ఈ సందర్భంగాచింతకాయల రాజేష్ పార్టీ కండువాలు కప్పి వారిని తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీనాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో హోంమంత్రి అనిత సుడిగాలి పర్యటన

అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితుల పరిశీలన..ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన





రాయవరం , అక్టోబర్ 28 (మనం న్యూస్) : అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో పాయకరావుపేట నియోజకవర్గంలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సుడిగాలి పర్యటన చేపట్టారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ఎస్.రాయవరం మండలంలోని పలు ప్రాంతాలను సందర్శించి, తుఫాన్ ప్రభావంతో నెలకొన్న పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వరహా నదిలోని పెనుగొల్లు గ్రోయిన్‌ను హోంమంత్రి పరిశీలించారు. అనంతరం రాయవరం నుంచి లింగరాజుపాలెం వెళ్లే బ్రిడ్జిని సందర్శించి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు, చేపట్టిన ముందస్తు చర్యలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రాయవరంలో స్థానిక ప్రజలతో మాట్లాడిన మంత్రి అనిత, తుఫాన్ ప్రభావం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. తీర ప్రాంతాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అధికారులు జారీ చేసే సూచనలు పాటించాలని కోరారు. తుఫాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం సూచనలను తప్పనిసరిగా పాటించాలని హోంమంత్రి అనిత విజ్ఞప్తి చేశారు.

చింతలమ్మ ఘాట్ వద్ద కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల పరిశీలించి,తక్షణ చర్యలపై ఆదేశాలు : ఐటీడీ ప్రాజెక్టర్ అధికారి ఆదిత్య వర్మ





ఏ ఎస్ ఆర్ జిల్లా పాడేరు / కొయ్యూరు , అక్టోబర్ 28 (మనం న్యూస్) : అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం పరిధిలోని ప్రసిద్ధ చింతలమ్మ ఘాట్ ప్రాంతంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడి, ప్రమాదాలుగా ఉన్న ప్రాంతాలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులు, గతంలో ఎదురైన ఇబ్బందులు, ప్రయాణికుల భద్రతా చర్యలపై తహశీల్దార్, ఎస్.హెచ్.ఓ., ఎం.పి.డి.ఓ అలాగే ఎన్.హెచ్-516ఈ (NH-516E - జాతీయ రహదారి) ఎస్ డి ఆర్ ఎఫ్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించి, పలు ఆదేశాలు జరిసేశారు .వర్షం గాలి తగ్గగానే సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రవాణా భద్రత పై ప్రయాణికులకు ఎలాంటి అంతరాయం కలగకుండా, ప్రమాదాలు జరగకుండా ఘాట్ రోడ్డు వెంబడి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న సున్నితమైన ప్రాంతాల్లో తక్షణమే తగిన ఇంజనీరింగ్ రక్షణ చర్యలు చేపట్టేలా, చర్యలు వేగవంతం చేయాలని నేషనల్ హైవే (చీన-516ఙ) అధికారులకు సూచించారు. సహాయక చర్యలు అధికారులు సమన్వ యంతో పర్యవేక్షించి డామేజ్ అయిన ప్రదేశాలను వెంటనే పునరుద్దించాలని అధికారులకు చూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ట్రాఫిక్ నిలిచిపోకుండా రెవెన్యూ, పోలీను, పంచాయతీ రాజ్, జాతీయ రహదారుల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణా లకు ముప్పు వాటిల్లకుండా ముందస్తు నివారణ చర్యలను యుద్ధప్రాతివదికన పూర్తి చేయాలని అధికారులను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి తో పాటు కొయ్యూరు మండలం తహశీల్దార్ ప్రసాద్ రావు, రెవె న్యూ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ వేళ అప్రమత్తంగా ఉండాలి : డి.ఎస్.పి ఉదయపావని

వాగులు, జలాశయాల వద్ద పోలీసుల పర్యవేక్షణ..పర్యాటక ప్రాంతాలకు వెళ్లొద్దు.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి-సీఐ గోపాలకృష్ణ



పోలవరం జిల్లా (చింతూరు , అక్టోబర్ 28 (మనం న్యూస్) : అర్నాబ్ తుఫాన్ ప్రభావం చింతూరు సబ్ డివిజన్ పరిధిలో ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్న నేపథ్యంలో పోలీను ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వాగులు, వంకలు, జలాశయాలు, పర్యాటక ప్రాంతాల వద్ద పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలవరం జిల్లా ఓఎస్డీ ఎం. జవాలి ఆల్ఫోన్స్, చింతూరు సబ్ డివిజన్ డీఎస్పీ కె. ఉదయ పావని, చింతూరు సీఐ సీహెచ్. గోపాలకృష్ణ, మోతుగూడెం ఎస్ఐ అబ్దుల్ నాసిర్ హుస్సేన్ సొకులేరు వ్యూ పాయింట్‌తో పాటు వాగులు, నీటి ప్రవాహ ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు పెరిగి వాగులు ఉప్పొంగే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా వర్షాలు కురుస్తున్న సమయంలో వాగులు, వంకల వద్దకు వెళ్లడం, నీటి ప్రవాహాలను దాటేందుకు ప్రయత్నించడం ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు. పరిస్థితులు అనుకూలించే వరకు పర్యాటక ప్రాంతాలకు వెళ్లకుండా ప్రజలు సహకరించాలని కోరారు. అవసరమైన చోట పర్యాటకుల రాకపోకలను నియంత్రించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఐ గోపాలకృష్ణ

తుఫాన్ ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతూరు సీఐ గోపాలకృష్ణ కోరారు. భారీ వర్షాల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాల కింద నిలబడకూడదని, వాగులు, వంకలు, నీరు ప్రవహించే కల్వర్టుల వద్దకు వెళ్లకూడదని సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని, పోలీసు అధికారులు జారీ చేసే హెచ్చరికలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణ భద్రతే ప్రధానమని, తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని చింతూరు సిఐ గోపాలకృష్ణ తెలిపారు.

ఏబీఎన్ రాధాకృష్ణ తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలి

వైసీపీ అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరి



విశాఖవట్నం , అక్టోబర్ 28 (మనం న్యూస్) : ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరి విమర్శించారు. మహిళల విషయంలో రాధాకృష్ణ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మేనకోడలి వివాహాన్ని సైతం రాజకీయాలకు ఉపయోగించుకోవడం దురదృష్టకరమని ఆమె అన్నారు. వైఎస్ భారతి పేరుతో తప్పుడు లేఖను సృష్టించి, ఆమె రాయకుండానే రాసినట్లు ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటి తప్పుడు కథనాలను రాస్తూ మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళలు చూస్తూ ఊరుకోరని మంచా నాగమల్లేశ్వరి హెచ్చరించారు. రాధాకృష్ణ తన తప్పుడు ప్రచారానికి క్షమాపణ చెప్పే రోజు దగ్గరలోనే ఉందని అన్నారు. మహిళల ఆత్మగౌరవం కోసం అవసరమైతే ఏబీఎన్ కార్యాలయాల వద్దకు వెళ్లేందుకు కూడా మహిళా లోకం వెనుకాడబోదని స్పష్టం చేశారు. మహిళల సంక్షేమం గురించి గొప్పలు చెప్పుకునే నారా లోకేష్, మహిళలపై జరుగుతున్న ఈ తరహా ప్రచారంపై ఎందుకు స్పందించడం లేదని ఆమె ప్రశ్నించారు.

లోకేష్ ఇంట్లోని మహిళలే మహిళలా? మిగతా మహిళల గౌరవానికి విలువ లేదా? అని నిలదీశారు. మరోవైపు, తుఫాను నేపథ్యంలో ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టడంలో ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మంచా నాగమల్లేశ్వరి విమర్శించారు. ప్రజలను ఆదుకోవాల్సిన సమయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి, బాధితులకు తక్షణ సహాయం అందించాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళల గౌరవాన్ని కించపరిచే తప్పుడు ప్రచారాలను తక్షణమే నిలిపివేయాలని, సంబంధిత కథనాలపై బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలని మంచా నాగమల్లేశ్వరి డిమాండ్ చేశారు.